సాక్షి విశాఖపట్నం

బుధవారం । 13 । నవంబర్ । 2024



కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా మంగళవారం ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అనివెట్టి మండపం వద్ద మహిళలు దీపారాధన చేశారు. **పెద్ద ఎత్తున సామూహిక వ్రతాలు జరిగాయి.**

గుణుపూర్ పాసింజర్ రద్దు



తాటిచెట్లపాలెం: నౌపడ–గుణుపూర్ సెక్షన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే విశాఖ–గుణుపూర్–విశాఖ(08522/21) స్పెషల్ ఈ నెల 13, 16, 17, 20, 23, 24వ తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

క్యాన్సర్ ఓపీ ప్రారంభం



ఓపీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట : కేజీహెచ్ సీఎస్ఆర్ **బ్లాక్‌లో 40** నంబర్ ఓపీలో ప్రివెంటివ్ ఆంకాలజీ ఓపీని మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ప్రారంభించారు. ఈ ఓపీ ప్రతి మంగళ, గురువారాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో కేజీహెచ్ ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ నోడల్ అధికారి కె.సాయిసుష్మ, మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి కె.శిల్పా, రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి పాండురంగకుమారి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డి.రాధాకృష్ణన్, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి వి.ఎస్.ఎస్.మూర్తి, ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఈ నెల 14న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ప్రారంభిస్తారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

దాబాగార్డెన్స్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం జేసీ మయూర్ అశోక్ ఆవిష్కరించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథపాలకుల సదస్సు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు పోటీలు, 19న మహిళా దినోత్సవం 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

జాతీయ పోటీలకు నలుగురు ఆర్చర్ల ఎంపిక

కొమ్మాది: రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ మిషన్ ఆధ్వర్యంలో గాయత్రీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాడేరు, పార్వతీపురం, రంపచోడవరం, కోటరామచంద్రాపురం, సీతంపేట, చిత్తూరు, నెల్లూరు, శ్రీశైలం ఐటీడీఏల నుంచి 34 మంది పోటీపడ్డారు. ఇందులో దేశయ్య, కె.కృష్ణ, సీహెచ్ బాలకృష్ణ, చంచయ్య ప్రతిభ చూపి.. ఈ నెల 30న కేరళలోని వైనాడులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంస్థ ఈడీ డా.రాణి మందఈ పోటీలను పర్యవేక్షించారు.

ద్వారకా ఏసీపీ బదిలీ

విశాఖ సిటీ: ద్వారకా ఏసీపీ ఎస్.రాంబాబు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ద్వారకాతిరుమల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే రాంబాబుకు ఎటువంటి పోస్టింగ్ ఇవ్వలేదు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెస్ట్ ఏసీపీగా ఉన్న అన్నెపు నరసింహమూర్తిని ద్వారకాకు అటాచ్ చేశారు.

తుస్సుమన్న పంచాయతీ

- **పక్కదారిపట్టిన ఈవోపీఆర్డీ బదిలీల విచారణ**
- **అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో** బదిలీలపై ఆరోపణలు
- విశాఖ జిల్లాకే విచారణ పరిమితం
- నివేదికను కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు సమర్పించిన జెడ్పీ సీఈవో

మహారాణిపేట: మోకాలికి దెబ్బతగిలితే బోడి గుండుకు కట్టు వేసినట్లు ఉంది పంచాయతీరాజ్ శాఖ అధికారుల తీరు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తే.. వాటిని మినహాయించి విశాఖ జిల్లాలో బదిలీలపై మాత్రమే విచారణ చేయించడం విడ్డూరంగా ఉంది. అసలు దొంగలకు కొమ్ముకాయడానికి కూటమి నేతల నుంచి ఉన్నతాధికారుల వరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో తీవ్ర దుమారం రేపిన ఈవోపీఆర్డీల బదిలీల వ్యవహారంలో విచారణ చివరకు తుస్సుమనిపించారు. ఆరోపణలు ఉన్న జిల్లాల్లో విచారణ చేయకపోవడం పట్ల పంచాయతీరాజ్ ఉద్యోగులు విస్తుపోతున్నారు. ఈ బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఉద్యోగులే స్వయంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ.. విచారణను పక్కదారి పట్టించడం ఇప్పుడు పంచాయతీరాజ్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

అనకాపల్లి కేంద్రంగా అక్రమాలు

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈవోపీఆర్డీ అధికారుల బదిలీల వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. కొంతమంది పంచాయతీ అధికారులు, సిబ్బంది.. నచ్చిన వారిని అందలం ఎక్కించారన్న విమర్శలు వినిపించాయి. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్లు స్వయంగా ఉద్యోగులే బహిరంగంగా చెబుతున్నారు. ఈ అక్రమ బదిలీలు కారణంగా దీర్ఘకాలంగా అల్లూరి జిల్లాలో పనిచేస్తున్న వారు ఇప్పటికీ మైదాన ప్రాంతాలకు రాలేకపోయారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న వారు గిరిజన ప్రాంతాలకు వెళ్లకుండా తమ పలుకుబడిని ఉపయోగించి స్థానికంగానే పోస్టింగ్‌లు సంపాదించుకున్నారు. దీనిపై కొంత మంది ఉద్యోగులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఈ బదిలీల వ్యవహారంపై జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తితో విచారణకు ఆదేశించారు. దీని ప్రకారం సీఈవో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పోస్టింగ్‌ల వివరాలు కోరినప్పటికీ.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం విశేషం. విచారణ హాజరుకావాలని రెండు సార్లు అనకాపల్లి డీపీవో, అల్లూరి జిల్లా డీపీవోలకు చెప్పినా డుమ్మా కొట్టారు. బదిలీల జాబితాను సైతం విచారణాధికారికి ఇవ్వలేదన్న వాదనలు ఉన్నాయి. ఈ దశలో విచారణ నుంచి అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయించారు. ఆయా జిల్లాల్లో జరిగిన బదిలీలపైనే ఆరోపణలు రాగా.. వాటిని తప్పించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం విశాఖ జిల్లాలో మాత్రమే విచారణ చేపట్టేలా ఆదేశాలిచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే జెడ్పీ సీఈవో విశాఖ జిల్లాలో విచారణ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు.



ప్రజా ప్రతినిధుల హస్తం

జెడ్పీ సీఈవోను రెండు జిల్లాల విచారణ నుంచి తప్పించడంలో కొంత మంది ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. సమాచార సేకరణలో వేగంగా ఉండడం, బదిలీలైన వారి వివరాలు, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఇవ్వాలని జెడ్పీ సీఈవో అడగడంతో కొంత మంది అధికారుల్లో భయం నెలకొంది. ఈ విచారణకు పంచాయతీ అధికారులు సహకరించకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో కూటమి ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి తమ వారిని కాపాడుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశారు. అందువల్లే అనకాపల్లి, అల్లూరి జిల్లాలను విచారణ నుంచి మినహాయించారు. దీంతో మొత్తం విచారణ నీరు గారిపోయింది.

జనవరి 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయించినా జరిమానా
- కలెక్టర్ హరేందిరప్రసాద్ హెచ్చరిక



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: నగరంలో 2025 జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ వెల్లడించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం ఉంటుందని, దీనిని అతిక్రమించి విక్రయించినా.. వినియోగించినా భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో మంగళవారం నగరంలో పారిశుధ్య మెరుగుదల, ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణపై ఆర్పీలు, శానిటేషన్ కార్యదర్శులకు వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ద్వాక్రా మహిళల భాగస్వామ్యంతో 45 రోజుల పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. నగరంలోని మారుమూల ప్రాంతాలు కూడా శతశాతం పరిశుభ్రత ఉండేలా జీవీఎంసీ ప్రణాళికలు రూపొందించిందని, నగరం నుంచి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఉత్పత్తిదారులు, విక్రయదారులు, వినియోగదారులు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని సూచించారు. ఈ విషయమై జోనల్ కమిషనర్లు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని ఆర్పీల్లో ఒకరు మాస్టర్ ట్రైనర్‌గా, మిగిలిన ఆర్పీలు, మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ నగరంలో జీరో ప్లాస్టిక్, జీరో గార్బేజ్ దిశగా కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నగరం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేధం అమలు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కలెక్టర్, కమిషనర్ 'సే నో టు ప్లాస్టిక్' బ్రోచర్‌ను ఆవిష్కరించారు. దేశంలోనే విశాఖను పరిశుభ్ర నగరంగా మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సత్యవేణి, జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, ఏపీడీలు, డీపీవోలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నిక ప్రక్రియపై అవగాహన అవసరం

కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచన

మహారాణిపేట : నీటి సంఘాల ఎన్నిక ప్రక్రియపై అధికారులందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 23న జరగనున్న నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే ఈవో, ఏఈవో, పీవో, ఏపీవోలకు కలెక్టరేట్‌లో మంగళవారం ఒక్క రోజు శిక్షణ సదస్సు నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు వి.చిన్నంనాయుడు, ఆర్.సురేష్ కుమార్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. గత అనుభవాలు, ఇప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. సదస్సులో భాగంగా కలెక్టర్ పలు అంశాలపై సూచనలు చేశారు. భీమిలి, ఆనందపురం, పెందుర్తి, పద్మనాభం మండలాల పరిధిలో మొత్తం 29 నీటి సంఘాలకు ఈ నెల 23వ తేదీన ఎన్నిక ప్రక్రియ జరుగుతుందని, అందరూ సంసిద్ధంగా ఉండాలని సూచించారు. సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఏకగ్రీవం లేదా చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక ప్రక్రియ ఉంటుంది కాబట్టి.. రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, నీటి పారుదల శాఖ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు తీరని అన్యాయం

సీఐటీయూ నేతల ఆందోళన



జీవీఎంసీ గాంధీ పార్కులో మౌన దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సీతమ్మధార: రాష్ట్ర బడ్జెట్‌లో తమకు తీవ్ర అన్యాయం జరిగిందని మధ్యాహ్న భోజన కార్మికులు మండిపడ్డారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిటు నేతలు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రాజకీయ వేధింపులు ఆపాలని, వేతనాలు, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, అక్షయపాత్రలో పనిచేసే కార్మికులకు రాగి జావ వండినందుకు అదనపు వేతనం చెల్లించాలని, బకాయి జీతాలు, బిల్లులు వెంటనే చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫాంలు ఇవ్వాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, వంట వండేటప్పుడు, వడ్డించేటప్పుడు ప్రమాదానికి గురైతే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాల పెంచకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలనే డిమాండ్ గురించి ఏమాత్రం మాట్లాడకపోవడం, ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించడం బాధ కలిగిస్తోందన్నారు. యూనియన్ అధ్యక్షురాలు భవాని, ప్రధాన కార్యదర్శి జి.మంగశ్రీ, యూనియన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, ఆదిలక్ష్మి, వై.ధనలక్ష్మి, పి.చిన్నతల్లి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ కార్మికుల భద్రతకు 'నమస్తే'

దాబాగార్డెన్స్: సెప్టిక్ ట్యాంక్ కార్మికుల భద్రత, మెరుగైన ఉపాధికి రూపొందించిన 'నమస్తే' పథకంలో సంబంధిత కార్మికులు నమోదు కావాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్(నమస్తే) పథకం కార్యాచరణలో భాగంగా జీవీఎంసీలో సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌లో పాల్గొనే డ్రైవర్లు, హెల్పర్లు సంబంధిత జోనల్ కార్యాలయాల్లో వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పథకంలో నమోదుకాని వారిని సెప్టిక్ క్లీనింగ్ కార్యకలాపాల్లో పాల్గొనడాన్ని నిషేధించినట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా కార్మికులకు ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా రెట్టింపు వైద్య సహాయం, వారి పిల్లలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్స్, అధిక సబ్సిడీ ద్వారా సెప్టిక్ ట్యాంక్ అందించడం, భద్రత, జీవనోపాధి కల్పించేందుకు శిక్షణ, పీపీఈ కిట్స్ కూడా అందిస్తామన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



విశాఖలీగల్: జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. విశాఖ జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోటార్ ప్రమాదాలు, సివిల్, చెక్ బౌన్స్, రాజీపడదగిన క్రిమినల్ కేసులకు పరిష్కారం చూపాలన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. గాజువాక, భీమిలి తోపాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని న్యాయమూర్తులు వర్చువల్‌గా ఈ సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

రెక్కీ నిర్వహించి.. భారీగా దోచేసి!

ధార్ గ్యాంగ్ సభ్యుడి అరెస్ట్

- రూ.2.10 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- మిగిలిన ఐదుగురి కోసం కోల్‌కతా వెళ్లిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

అక్కిరెడ్డిపాలెం: మధ్యప్రదేశ్‌కు చెందిన అంతర్ రాష్ట్ర ముఠా ధార్ గ్యాంగ్ సభ్యుడితో పాటు సొత్తు దాచిన మరో వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు క్రైం ఏడీసీపీ మోహనరావు తెలిపారు. వారి నుంచి రూ.2.10 లక్షల సొత్తును రికవరీ చేసి, మిగిలిన ఐదుగురి కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. గాజువాక క్రైం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు.

శివాజీనగర్‌లోని ప్యాలెస్ హైట్స్ జి–7 బ్లాక్‌లో వెనుగంటి వినోద్‌బాబు భార్యతో కలసి నివాసం ఉంటున్నారు. అక్టోబర్ 16న వారి కుమారుడికి కొడుకు పుట్టిన సందర్భంగా తన భార్యతో కలసి వినోద్‌బాబు తిరుపతి వెళ్లారు. ఈ నెల ఒకటో తేదీన అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ అతనికి ఫోన్ చేసి.. ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయని చెప్పాడు. దీంతో వినోద్‌బాబు హుటాహుటిన బయలుదేరి గాజువాక చేరుకున్నారు. రెండో తేదీన ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెడ్ రూం కబోర్డులో లాకెట్ ఉన్న బంగారు గొలుసు, నల్లపూసలు, 6 తులాల 4 జతల చెవి దిద్దులు, వెండి గ్లాసులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఏసీపీలు డి.లక్ష్మణరావు, వెంకటరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. ఈ దొంగతనానికి కొన్ని రోజుల ముందు అపార్ట్‌మెంట్ వద్ద నిందితులు రెక్కీ నిర్వహించినట్లు వాచ్‌మన్ తెలిపాడు. ఇక్కడ ఎందుకు తిరుగుతున్నావని వారిని అడగ్గా.. స్టీల్‌ప్లాంట్‌లో కేబుల్ నెట్ వర్కింగ్ పనులు చేపడుతున్నట్లు చెప్పినట్లు వాచ్‌మన్ వెల్లడించాడు. సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుల వివరాలు సేకరించారు. ఈ క్రమంలో మంగళవారం కూర్మన్నపాలెం మెయిన్‌రోడ్‌లోని శ్రీ ఓం మణికంఠ జ్యువెలరీ షాపు ఎదురుగా నిందితుడు సహదర్(ఏ–2)ను దువ్వాడ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతను ధార్ గ్యాంగ్ ముఠా సభ్యుడిగా గుర్తించారు. సహదర్‌ది మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గుడియా. ఈ గ్యాంగ్‌పై దువ్వాడలో 3, పరవాడ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు నమోదయ్యాయి. దర్యాప్తులో భాగంగా వీరు దొంగిలించిన సొత్తును శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలం బారువకు చెందిన లక్ష్మణనాయుడు వద్ద దాచినట్లు గుర్తించారు. లక్ష్మణనాయుడిని కూడా అరెస్ట్ చేసి.. బంగారు గొలుసు, నల్లపూసల గొలుసు, చెవిదిద్దులు, 75 రకాల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నా రు. ఈ ముఠాలో కీలక సభ్యులైన ఐదుగురిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందం కోల్‌కతా వెళ్లింది.

పట్టుబడిన విదేశీ మద్యం

75 బాటిల్స్ విలువ రూ.4 లక్షల పైమాటే..



పట్టుబడిన మద్యం సీసాలతో ఏఈఎస్ ఈశ్వరరావు, సర్కిల్–2 ఎక్సైజ్ సిబ్బంది

ఎంవీపీకాలనీ: నగరంలో విదేశీ మద్యం పట్టుబడింది. అల్లిపురం అచ్చయ్యమ్మపేటలోని నానిబిల్లి గణేశ్వరరావు ఇంట్లో ఈ అక్రమ మద్యాన్ని ఎంవీపీకాలనీలోని సర్కిల్–2 ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ వివరాలను అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు, సర్కిల్–2 సీఐ జగదీశ్వరరావు మంగళవారం స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ నెల 11న రాత్రి అచ్చయ్యమ్మపేటలో గణేశ్వరరావు ఇంట్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో విదేశీ మద్యం సీసాలతో పాటు ఖరీదైన పలు రాష్ట్రాలకు చెందిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 18 విదేశీ మద్యం సీసాలతో పాటు గోవాకు చెందిన 21, కర్ణాటకకు చెందిన 7, తెలంగాణకు చెందిన 18, ఢిల్లీకి చెందిన 4, డిఫెన్స్‌కు చెందిన 7 మద్యం సీసాలు ఉన్నాయి. వీటి విలువ రూ.4 లక్షలకు పైగా ఉంటుందని వెల్లడించారు. వీటిపై ఆరా తీయగా ఇతర రాష్ట్రాలకు వెళ్లినప్పుడు తీసుకొచ్చినట్లు గణేశ్వరరావు చెప్పాడు. విదేశీ మద్యం సీసాలను తన మేనల్లుడు లక్ష్మణ్ అవినాష్ ద్వారా తెప్పించినట్లు, ఆయా మద్యం సీసాలను తెలిసిన వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అతనిపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసును పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. సర్కిల్–2 సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త, అత్తకు రిమాండ్

సీతమ్మధార: అక్కయ్యపాలెం రామచంద్రానగర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత కేసులో భర్త, అత్తలకు 14 రోజులపాటు రిమాండ్ విధించారు. ఆత్మహత్యకు పాల్పడిన దిల్లీశ్వరి(25) మృతదేహానికి మంగళవారం కేజీహెచ్‌లో పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం కుటుంబ సభ్యు లు అక్కయ్యపాలెం శ్మశానవాటికలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. అదనపు వరకట్నం కోసం వేధించి దిల్లీశ్వరి మరణానికి కారణమైన భర్త రాజశేఖర్, అత్త కడగల ఉమామహేశ్వరిని కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. ఈ ఘటనపై దిల్లీశ్వరి తల్లిదండ్రులు కిమిడి సూరిబాబు, కృష్ణకుమారి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. దిల్లీశ్వరి కుమారుడు మౌరిస్‌ను రాజశేఖర్ మేనమామ కుమార్తె సంరక్షణలోనే ఉంచారు. ఏసీపీ కె.లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో సీఐ ఎస్.వి జయకుమార్ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.